క్లుప్తంగా

నృసింహస్వామి మాలధారులకు అన్నదానం

మంగళగిరి: లక్ష్మీ నృసింహస్వామి మాల ధారణ 41 రోజులు పూర్తి చేసుకున్న స్వాములకు బుధవారం అన్నదానం చేశారు. తోట శ్రీనివాసరావు మిత్ర బృందం ఆధ్వర్యంలో నగరంలోని లక్ష్మీ నారాయణ స్వామి దేవాలయంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పార్టీ ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, శివాలయం మాజీ చైర్మన్ మునగపాటి వెంకటేశ్వరరావు, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ మేకా వెంకటరామిరెడ్డి, మంగళగిరి కన్వీనర్ వ్యానం అజయ్ హాజరయ్యారు.

నేడు కేఎల్‌యూలో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ సక్సెస్ మీట్

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ సక్సెస్ మీట్ గురువారం నిర్వహించనున్నట్లు ఉద్యోగాల కల్పన డీన్ డాక్టర్ ఎన్.బి.కె.ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022 విద్యా సంవత్సరంలో ఇంజినీరింగ్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్స్ కోర్సులు పూర్తి చేసుకున్న ఆరువేల మంది విద్యార్థులకు అత్యుత్తమ ప్యాకేజీలతో అనేక ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ కంపెనీలలో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ సాధించడంతో ఈ సక్సెస్ మీట్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. 2005 నుంచి వందశాతం ప్రాంగణ ఎంపికల్లో విజయం సాధిస్తూ కేఎల్‌యూ పలుమార్లు రికార్డులు సృష్టించిందని స్పష్టం చేశారు. ప్రతి సంవత్సరం మెరిట్ విద్యార్థుల కోసం తమ విశ్వవిద్యాలయం కోట్ల రూపాయల స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నట్లు వివరించారు. నేడు సాయంత్రం జరుగనున్న క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ సక్సెస్ మీట్‌కు రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత, గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని చెప్పారు.

ఉత్సాహంగా హోలీ

తాడేపల్లి రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో, దుగ్గిరాల మండల పరిధిలో బుధవారం ఉత్సాహంగా హోలీ వేడుకలు నిర్వహించారు. పాఠశాలలకు సెలవు ప్రకటించడంతో చిన్నారులు రోడ్లపైకి వచ్చి హోలీ వేడుకలు నిర్వహించారు.

పదో తరగతి విద్యార్థి అదృశ్యం


విద్యార్థి తొమటం ఏసు (ఫైల్)

మంగళగిరి: నగర పరిధిలోని యర్రబాలెం బసవతారక నగర్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి అదృశ్యమయ్యాడు. వివరాలు.. బసవతారకనగర్‌కు చెందిన తొమటం ఆనందరాజు, భూలక్ష్మి దంపతుల కుమారుడు ఏసు నగర పరిధిలోని పెనుమాక వందేమాతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. మంగళవారం తన సోదరునితో కలసి ఇంట్లో ఆడుకుంటుండగా గమ్ బాటిల్ నేలపై ఒలకగా తల్లి భూలక్ష్మి మందలించింది. దీంతో మనస్తాపం చెందిన ఏసు అదే రోజు మధ్యాహ్నం అలిగి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. రాత్రి సమయమైనా తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు తమ కుమారుడు ఏసుబాబు ఆచూకీ కోసం వెతికినా కనిపించలేదని పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

వైభవంగా మహాలక్ష్మి అమ్మవారి జయంతి

తెనాలి: సాలిగ్రామ మఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఇక్కడి తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో బుధవారం మహాలక్ష్మి అమ్మవారి జయంతి మహోత్సవాలు, అంతర్జాతీయ మహిళా దినోత్సవం, సామూహిక మణిద్వీప వర్ణన గళార్చన ఘనంగా నిర్వహించారు. పూజ్యశ్రీ ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామీజీ) నేతృత్వంలో మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. రచయిత శివకవి తొమ్మిదిసార్లు మణిద్వీప వర్ణనను గానం చేశారు. ట్రస్ట్ చైర్మన్ నంబూరు వెంకట కృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. హైందవ ధర్మ ప్రాముఖ్యతపై కొండవీటి జ్యోతిర్మయి ఉపన్యసించారు. అలాగే అన్నమయ్య కీర్తనలను హృద్యంగా ఆలపించారు. ఎస్.అనంతలక్ష్మి ప్రవచనం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సాలిగ్రామ మఠం ట్రస్ట్ చేస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలను ప్రశంసించారు. ఆధ్యాత్మిక కార్యక్రమంతోపాటు మహిళా దినోత్సవం జరపటాన్ని అభినందించారు. మహిళ విశిష్టతను ఆయన సోదాహరణంగా వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని రంగాల్లో మహిళలకు అగ్రాసనం వేస్తున్నారని గుర్తుచేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ తన ప్రసంగంలో భారతదేశంలో కుటుంబ వ్యవస్థ ఎంతో గొప్పని చెప్పారు. తెనాలి డీఎస్పీ డాక్టర్ కె.స్రవంతిరాయ్ మాట్లాడుతూ, ఎన్నో పోరాటాల ఫలితంగానే నేడు మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శివకుమార్‌ను సాలిమఠం ట్రస్ట్ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. సిద్ధా లక్ష్మీపద్మావతి, పాతూరి వెంకట ఆదిలక్ష్మి, బూరెల అరుణకుమారి, తూనుగుంట్ల దుర్గాభవాని, నాగవరపు లక్ష్మీసాప్రమణ్యం, గడ్డిపాటి శ్రీనివాసరావు, ఉమాదేవిని కూడా సన్మానించారు. ముద్దా బక్షుని రమణయ్య పర్యవేక్షించగా, డాక్టర్ ములుకుట్ల విశ్వనాథశర్మ సభానిర్వహణ చేశారు. రావూరి సుబ్బారావు, గోవు రామకృష్ణ, మాల్యాద్రి పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

తాడికొండ: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గుంటూరులోని తన కార్యాలయంలో సంబరాలు ఘనంగా నిర్వహించారు. మేడికొండూరు ఎంపీపీ మన్నవ స్వప్న పలువురు విద్యార్థినులతో కలసి కేకును కత్తిరించి సంబరాలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలకు అన్ని రంగాలలో 50 శాతం రిజర్వేషన్లు కల్పించిన జగనన్నదే అన్నారు. గతంలో ఆడపిల్ల పుడితే భారంగా భావించే తల్లిదండ్రులు నేడు మహాలక్ష్మి అనే పరిస్థితి ఏపీలో ఉందన్నారు. మహిళల కోసం దిశ చట్టం, సున్నా వడ్డీ, వైఎస్సార్ ఆసరా, జగనన్న చేదోడు, ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్ళ నిర్మాణం వంటి అనేక పథకాలు ప్రవేశపెట్టి మహిళలకు ఆర్థికంగా ఆసరాగా నిలిచారని చెప్పారు.


గుంటూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో చిన్నారులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి


స్థానిక ప్రజాప్రతినిధులకు కేక్ తినిపిస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్

మహిళలకు అన్నింటా అగ్ర తాంబూలం ఘనత జగనన్నదే

మహిళలకు సమాన అవకాశాలు కల్పిస్తూ అన్నింటా అగ్ర తాంబూలం వేసిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిదేనని తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గుంటూరులోని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. అనంతరం తాడికొండ, ఫిరంగిపురం, మేడికొండూరు ఎంపీపీలు తాళ్ళ భాగ్యలక్ష్మి, సహేలా నర్గీస్, మన్నవ స్వప్న, తాడికొండ, ఫిరంగిపురం జెడ్పీటీసీలు గుడిమెట్ల జ్యోతి, దాసరి కత్తిరే బమ్మ పలువురు మహిళా సర్పంచులను శాలువాలు, చీరెలతో ఘనంగా సత్కరించారు.


వైద్యురాలు డాక్టర్ రాజేశ్వరిని సత్కరిస్తున్న నిర్మల ఫార్మసీ కళాశాల ప్రతినిధులు


పోలకంపాడులో మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ర్యాలీ

మంగళగిరి: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగర పరిధిలోని ఆటోనగర్‌లోని ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ మహిళలకు యాభై శాతం రిజర్వేషన్లు, రాజకీయంగా ఉన్నత పదవులను కేటాయించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. మహిళలు మరింత అభివృద్ధి చెందాలంటే జగన్ మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన బాధ్యత రాష్ట్రంలోని ప్రతి మహిళ తీసుకోవాలన్నారు. కార్యక్రమానికి మహిళా విభాగం పట్టణ కన్వీనర్ సంకె సునీత అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి, జిల్లా మహిళా విభాగం కార్యదర్శి మల్లవరపు సుధారాణి, శివాలయం ట్రస్టు బోర్డు చైర్ పర్సన్ నేరెళ్ల లక్ష్మీ రాధిక, ట్రస్టు బోర్డు సభ్యులు రేకా పకుశాదేవి, మహిళా విభాగం తాడేపల్లి పట్టణ కన్వీనర్ సంపూర్ణ పార్వతి, మార్కెట్ యార్డు మాజీ చైర్ పర్సన్ దొడ్డక శివ పార్వతి, మార్కెట్‌యార్డు డైరెక్టర్లు ఆలూరి రాజ్యం, మాణిక్యాల లక్ష్మి, సెక్రటరీ జ్యోతి, చేనేత విభాగం జిల్లా అధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో..

తాడేపల్లి రూరల్: పట్టణ పరిధిలోని పోలకంపాడు, కేఎల్‌రావు కాలనీ డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంటీఎంసీ సీఎంఎండి.పావని పాల్గొన్నారు. మహిళలకు పలు రకాల ఆటల పోటీలు నిర్వహించి, భ్రూణ హత్యలు, బాల్య వివాహాలు, మహిళా హక్కుల చట్టాలపై డిబేట్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా పోలకంపాడు శివాలయం నుంచి ఉండవల్లి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పావని మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని చెప్పారు. ఆటల పోటీలు, డిబేట్‌లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీఓలు ఇందిర, పద్మ, యానిమేటర్లు టి. లక్ష్మి, శ్రీలక్ష్మి, సుహాసిని పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

మంగళగిరి: స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు మ్యూజికల్ చైర్స్, లెమన్ స్పూన్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు.


మహిళా నేతలు సంకె సునీత, మునగాల భాగ్యలక్ష్మి, సుధారాణిలను సన్మానిస్తున్న దృశ్యం


మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయంలో మ్యూజికల్ చైర్స్ ఆడుతున్న మహిళలు

నిర్మల ఫార్మసీ కళాశాలలో...

నగర పరిధిలోని నిర్మల ఫార్మసీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఆయుర్వేద వైద్యురాలు రాణేశ్వరి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు వివిధ వయసుల్లో వచ్చే హార్మోన్ అసమతుల్యత, ఆరోగ్య సమస్యలతో పాటు వివిధ ఔషధ మొక్కలు వాటి ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ రమాదేవి, కళాశాల ప్రెసిడెంట్ సిస్టర్ సుందరి, సెక్రటరీ నిర్మల జ్యోతి, ప్రిన్సిపాల్ డాక్టర్ రెహమాన్ పాల్గొన్నారు.

కేఎల్‌యూలో..

తాడేపల్లి రూరల్: రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంక్షేమ విభాగ అధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు మాట్లాడుతూ సమాజంలో మహిళ పాత్ర ఎంతో కీలకమన్నారు. లింగ సమానత్వం సాధించిన నాడు పౌర హక్కులకు సరైన అర్థం చేకూరుతుందని చెప్పారు. ఎంబీఏ విభాగ అధిపతి డాక్టర్ కె.హేమదివ్య మాట్లాడుతూ రాజకీయాలలో మహిళల పాత్ర గురించి వివరించారు. మహిళలకు రాజకీయ పార్టీలో సముచిత స్థానం కల్పించడంలో ఇంకా పురోగతి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. కామర్స్ డెప్యూటీ విభాగ అధిపతి డాక్టర్ ఎస్.కాంతకుమారి మాట్లాడుతూ మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం అవసరమన్నారు. అనంతరం వ్యాస రచన, డ్యాన్స్ పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కేఎల్ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న పలువురు మహిళా అధ్యాపకులు, వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, విద్యార్థి వ్యవహారాల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.రూతు రమ్య, డీన్ సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్, హాబీ క్లబ్ సుధాకరరాజు, ఎన్.సి.సి. అధికారిణి డాక్టర్ ఎ.పావని, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ జి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.


కేఎల్‌యూలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మహిళా అధ్యాపకులు

తాడికొండ తహసీల్దార్ కార్యాలయంలో..

తాడికొండ: విద్య ద్వారానే మహిళలు అన్ని రంగాలలో ఉన్నతంగా రాణించవచ్చని తహసీల్దార్ జీవీఎస్ ఫణీంద్ర బాబు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం స్థానిక కార్యాలయంలో కేకును కత్తిరించి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా వీఆర్వో, వీఆర్‌ఏ, సిబ్బందిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ కాకుమాను ప్రసాద్ పాల్గొన్నారు.


వీఆర్వో, వీఆర్‌ఏలను సత్కరిస్తున్న తహసీల్దార్ ఫణీంద్రబాబు, డీటీ ప్రసాద్

నేడు నిడుముక్కలలో గడప గడపకు మన ప్రభుత్వం

తాడికొండ: మండలంలోని నిడుముక్కలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ బుధవారం తెలిపారు. సాయంత్రం 3 గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మంగళగిరి: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ అక్కల సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిడమర్రు ఎస్సీ కాలనీ, శివాలయం ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ ఉండదని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చకచకా పన్నుల వసూలు

తాడేపల్లి రూరల్: కార్పొరేషన్ పరిధిలో రెవెన్యూ సిబ్బంది ఇంటింటికి తిరిగి బకాయి ఉన్న ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను, నీటి పన్నులను వసూలు చేస్తున్నారు. 35 గ్రామ సచివాలయాల్లో ఉన్న రెవెన్యూ సిబ్బంది తమ పరిధిలోని వలంటీర్లతో కలసి పన్ను వసూలుకు కార్పొరేషన్ కమిషనర్ శారదాదేవి మార్చి 31 నాటికి వసూలు లక్ష్యంగా నిర్దేశించారు. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పూర్తి స్థాయిలో పన్నులు వసూలు చేస్తున్నట్లు ఆర్‌ఐ మురళి తెలిపారు. ఇప్పటికే 65 శాతం పన్నులు వసూలు చేసినట్లు చెప్పారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

తాడికొండ: తాడికొండ కంతేరు రోడ్డులోని గోగినేని కనకయ్య ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో శంకర కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం గురువారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో భాగంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించి శుక్లాలు ఉన్న వారికి శస్త్ర చికిత్సల నిమిత్తం శంకర కంటి ఆస్పత్రికి పంపించడం జరుగుతుందని చెప్పారు.

ముగిసిన సాయినాథ మందిర వార్షికోత్సవం

ఫిరంగిపురం: మండలకేంద్రంలోని షిరిడి సాయినాథ మందిర వార్షికోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఉదయాన్నే స్వామికి అర్చకులు విశ్వనాథశాస్త్రి, వేదపండితులు నారాయణం ప్రసాదాచార్యులు, వంశీకృష్ణ విశేష అర్చనలు చేసి అభిషేకాలు నిర్వహించారు. సాయినాథ ఉత్సవమూర్తికి భక్తుల స్వహస్తాలతో అభిషేకాలు నిర్వహించేలా ఆలయపాలక వర్గసభ్యులు ఏర్పాటు చేశారు. వార్షికోత్సవం సందర్భంగా పూజల్లో ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి పాల్గొన్నారు. అన్నదానం చేశారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే చేయూత

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు గ్రామానికి చెందిన బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ప్రకటించిన రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని బుధవారం అందజేశారు. గ్రామానికి చెందిన గోశాల బుజ్జి ప్రమాదవశాత్తు జరిగిన ఘటనలో తన కాలుకి మరియు చేతికి శస్త్ర చికిత్స జరిగిన పనులకు వెళ్లలేక ఇబ్బంది పడుతున్న తరుణంలో ఆమె కుమారుడు జీవన్ ఎమ్మెల్యేకు వాట్సప్ సందేశం పంపగా ఎమ్మెల్యే స్పందించి సాయం ప్రకటించారు. దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నాయకులు దానబోయిన వెంకటేశ్వరరావు బాధితురాలికి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ సుభాని, ఉన్నం రాజేష్, దానబోయిన బాబు, గ్రామ కన్వీనర్లు దాసరి కెజియా, కావూరి అశోక్, దుక్క సాంబశివరావు పాల్గొన్నారు.



బుజ్జికి ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న దుగ్గిరాల ఎంపీపీ సంతోష రూపవాణి, జెడ్పీటీసీ అరుణ

చింతలపూడిలో..

మండల పరిధిలోని చింతలపూడి గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు ప్రమాదవశాత్తు రెండవ అంతస్తు నుంచి కిందపడి కాళ్లు చేతులు చచ్చుపడిపోయి ఇంట్లోనే ఉండడంతో కుటుంబ పోషణ కష్టంగా ఉండడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆర్కే రూ. 25 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు.

ప్రైవేటు వెంచర్లతో మూతపడుతున్న డ్రైయినేజ్‌లు

తాడికొండ: ప్రైవేటు వెంచర్ల జోరుతో గ్రామాల్లోని మురుగు, వరద నీరు బయటకు వెళ్లే డ్రెయిన్‌లు మూతపడుతున్నాయి. తమ వ్యాపారం కోసం అనుమతులు లేకుండానే పదడుగులు పైన ఉన్న డ్రెయిన్‌లను చిన్నపాటి పైపులు వేసి పూడ్చివేస్తుండటంతో వర్షాకాలం ఇబ్బందులు తప్పవని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లాం, పొన్నెకల్లు, తాడికొండ, నిడుముక్కల, మోతడక, ఫణిదరం, దామరపల్లి, పలు గ్రామాల పరిధిలో ఈ ఏడాది ప్రైవేటు వెంచర్లు భారీగా వెలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎలాంటి అనుమతులు లేకుండా వేస్తున్న పలు ప్రైవేటు వెంచర్ల నిర్వాహకులు డ్రెయిన్‌లను మూసివేసి లేఅవుట్‌లు వేస్తుండటం పరిపాటిగా మారింది. ఇటీవల లాం గ్రామంలో వేసిన ప్రైవేటు వెంచర్‌పై గ్రామస్తులు వ్యతిరేకత వ్యక్తం చేసి తొలగించాలని సూచించినా సంబంధిత అధికారులు పట్టించుకోపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి డ్రెయిన్‌లను అడ్డగోలుగా పూడ్చివేసే ప్రక్రియకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.


తాడికొండలో పైపులైన్‌లు వేసి మూసివేస్తున్న భారీ డ్రెయిన్

ఆటల పోటీలు

తెనాలిటౌన్: రూరల్ మండలం హాఫ్‌పేటలోని ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్ (క్రాఫ్) ఆధ్వర్యంలో బుధవారం ఆటల పోటీలు నిర్వహించారు. సూపర్ జూనియర్స్, సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాలకు విద్యార్థులను విభజించి రింగ్స్ గేమ్, పిరమిడ్ గేమ్, బాల్ అండ్ స్పూన్స్ గేమ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ముఖ్యఅతిథులుగా పాల్గొన్న ఎంపీటీసీ సభ్యులు ఇనుకపల్లి సుందరరావు పాల్గొన్నారు.

కోలాటం మాస్టర్ అప్పారావుకు సన్మానం

తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో బుధవారం మిస్సమ్మ చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. గురువారం బభ్రువాహన చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం కోలాటం మాస్టర్ దానబోయిన అప్పారావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గోగినేని రమేష్ బాబు, కొత్తపల్లి రమేష్, కనగాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముగిసిన అష్టలక్ష్మీ అమ్మవార్ల జయంతి

తెనాలి: పట్టణ కొత్తపేటలోని అష్టలక్ష్మీ దేవాలయంలో అష్టలక్ష్మీ అమ్మవార్ల 25వ జయంతి రజతోత్సవాలు ఘనంగా ముగిశాయి. చివరి రోజైన బుధవారం అమ్మవారికి మహాకుంభాభిషేకం చేశారు. అనంతరం సహస్ర నామార్చనను నిర్వహించారు. నంగూరు కాశీ వనాశ్రమ పీఠాధిపతులు పూజ్యయోగిని చంద్రకాశీప్రసాద మాతాజీ అధ్యక్షతన అష్టలక్ష్మీ పీఠం సంస్థాపకుడు దిండి స్వాములు ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాలకు ఉభయ తెలుగు రాష్ట్రాల్నుంచి పలువురు పీఠాధిపతులు హాజరైన విషయం తెలిసిందే. స్థానిక కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం నిర్వహణలో మూడురోజులు వైభవంగా జరిగిన ఉత్సవాల్లో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. చివరిరోజు మధ్యాహ్నం నుంచి స్థానిక ఎన్వీఓ కళ్యాణమండపంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.


అష్టలక్ష్మీ అమ్మవారి ఆలయంలో మహాకుంభాభిషేకం

చలివేంద్రం ప్రారంభం



తెనాలిటౌన్: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని నందివెలుగు సర్పంచి, వైఎస్సార్ సీపీ నాయకుడు దూళిపాళ్ళ పవన్‌కుమార్ పేర్కొన్నారు. తెనాలి–విజయవాడ రహదారిపై రూరల్ మండలం నందివెలుగు మెయిన్‌సెంటర్‌లో 'మేము సైతం' యువజన సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచి పవన్‌కుమార్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేము సైతం సేవా సంఘం సభ్యులు గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. సేవా సంఘం సెక్రటరీ షేక్ షుకూర్ బాషా మాట్లాడుతూ గత ఆయిదు సంవత్సరాల నుంచి చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తూ ఈ ప్రాంత ప్రజల దాహార్తిని తీర్చుతున్నామన్నారు. సేవా సంఘం అధ్యక్షుడు కల్యాణం సాంబశివరావు, ఉపాధ్యక్షుడు యర్రమోతు జగన్మోహనరావు, కార్యదర్శి షుకూర్ బాషా, సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా కాశీవిశ్వేశ్వరుడి తిరునాళ్ల

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడులో విశాలాక్షి అన్నపూర్ణసమేత కాశీవిశ్వేశ్వరుడి తిరునాళ్ల మంగళవారం రాత్రి వైభవంగా ప్రారంభమైంది. స్వామికి అర్చకులు అంజనేయశాస్త్రి ఆధ్వర్యంలో మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. మండపంలో స్వామివార్లకు వసంతోత్సవం నిర్వహించి ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. కల్యాణం నిర్వహించి, ధ్వజారోహణం చేయించారు. తిరునాళ్ల సందర్భంగా కోలాటాలు , భజనలు, కీర్తనలు ఏర్పాటు చేశారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్‌దీపాలతో అలంకరించారు. ప్రత్యేక అలంకారాలతో, విద్యుత్ కాంతులతో ప్రభలు ఏర్పాటు చేశారు. ఆలయంలో స్వామివారి పూజల్లో ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజలు నిర్వహించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో సర్పంచి జి.నాగమల్లేశ్వరి, ఎంపీటీసీ సభ్యుడు ఐలా సీతారామిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు అప్పిరెడ్డి, జి.చౌడయ్య, సంజీవరెడ్డి, ఈట జి.రామిరెడ్డి పాల్గొన్నారు.


స్వామివారి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి

బాలల్లో విజ్ఞానం పెంపొందించేందుకే బాలోత్సవం

బాలోత్సవాల రాష్ట్ర కన్వీనర్ పి. మురళీకృష్ణ

తాడేపల్లి రూరల్: బాలోత్సవంలో పాల్గొనడం ద్వారా బాలబాలికలు విజ్ఞాన సముపార్జన సాధ్యమని బాలోత్సవాల రాష్ట్ర కన్వీనర్ పిన్నమనేని మురళీకృష్ణ అన్నారు. ఉగాది బాలోత్సవం సన్నాహక సమావేశం కాన్ఫడరేషన్ ఆఫ్ అపార్ట్‌మెంట్ అసోసియేషన్, తాడేపల్లి (క్యాట్) అధ్యక్షుడు జీఎస్‌ఆర్ మోహనరావు అధ్యక్షతన తాడేపల్లిలోని నేతాజీ టవర్స్‌లోని కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి పెద్ద ఎత్తున బాలోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 22వ తేదీ ఉగాది సందర్భంగా క్యాటర్, మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో ఉగాది బాలోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ బాలోత్సవంలో కల్చరల్, అకడమిక్ పోటీలు, కోలాటం ప్రదర్శనలు ఉంటాయని అన్నారు. సమావేశంలో ఎంటీఎంసీ బాలోత్సవ కోశాధికారి గాదె సుబ్బారెడ్డి, అమరావతి బాలోత్సవం నిర్వాహకులు యూపీ రామరాజు, క్రాంతి, నాగరాజు, రియాజ్ బాషా, పి.శ్రీలక్ష్మి, పి.గిరిజ, యార్లగడ్డ సుబ్బారావు, కొట్టి కరుణాకరరావు, జి.వెంకటేష్, జి.అవినాష్ రెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బాలోత్సవాల రాష్ట్ర కన్వీనర్ పి. మురళీకృష్ణ